

ఆమనగల్లు పాఠశాలలో తోరణాలను సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు



వేడుకలకు సిద్ధమవుతున్న కలెక్టరేట్

సర్వం సిద్ధం

- స్వాతంత్ర్య వేడుకలకు కలెక్టరేట్ ముస్తాబు
- జాతీయ జెండాను ఆవిష్కరించనున్న సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 14 : స్వాతంత్ర దిన వేడుకలకు కలెక్టరేట్ ముస్తాబైంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటి సారిగా నిర్వహిస్తున్న ఈ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించుకునేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. కొంగరకలాన్‌లోని జిల్లా కలెక్టరేట్ జరిగే వేడకలకు హాజరయ్యే వీఐపీలు, అధికారులకు, మీడియా, ఇతరులకు సీటింగ్ ఏర్పాటు చేశారు. భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. వేడుకలు ఉదయం 9.45 గంటలకు ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి సలహాదారు (ప్రజా వ్యవహారాలు) వేం నరేందర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. అనంతరం ఉదయం 10.02 గంటలకు ఆయన పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. తర్వాత 10.05 గంటలకు రాష్ట్ర, జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 10.20 గంటలకు విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉదయం 10.40 గంటలకు స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తారు. 10.45 గంటలకు ప్రభుత్వ శాఖలో అంకితభావంతో పనిచేసిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేయనున్నారు. 11.10 గంటలకు వందన సమర్పణతో కార్యక్రమాలు ముగుస్తాయని కలెక్టర్ శశాంక తెలిపారు.



ఇక ఎల్‌ఆర్‌ఎస్

క్రమబద్ధీకరణ ప్రక్రియకు అడుగులు

- మార్గదర్శకాలు విడుదల, మూడు దశల్లో వడపోత
- సీజీజీ ప్రత్యేకంగా రూపొందించిన అప్లికేషన్ ద్వారా ప్రాసెస్

దాదాపు నాలుగేళ్లుగా నిరీక్షిస్తున్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారుల కల త్వరలోనే నెరవేరబోతుంది. తమ స్థలంలో సొంతింటి నిర్మాణం చేపట్టేందుకు ఎట్టకేలకు మార్గం సుగమమైంది. అక్రమ లేఅవుట్‌లు, ప్లాట్ల క్రమబద్ధీకరణతో స్థానిక సంస్థలకు ఆదాయం, విక్రయదారులకు ఊరట లభిస్తుందని భావించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ (లేఅవుట్ రెగ్యులేషన్ స్కీం) తీసుకొచ్చింది. దీంతో 2020లో ఆన్‌లైన్ ద్వారా రూ. 1,000 ఫీజు చెల్లించి యజమానులు దరఖాస్తు చేసుకున్నారు. వీటి ద్వారా సర్కారు ఖజానాకు భారీగా ఆదాయం సమకూరింది. కానీ ఆర్జీలను పరిశీలించలేదు. ఎట్టకేలకు కాంగ్రెస్ సర్కార్ అనుమతి లేని లే అవుట్లు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీంతో నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి మార్గం సుగమమైంది. వీటిపై మూడు నెలల్లో తేల్చి క్రమబద్ధీకరించాలన్న ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా అధికారులు ఆ దిశగా చర్యలకు ఉపక్రమించారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు ప్రత్యేక బృందాలను నియమించారు.

రెగ్యులరైజేషన్ కోసం వచ్చిన దరఖాస్తుల వివరాలు

ప్రాంతం	దరఖాస్తులు
పంచాయతీలు	63,630
మున్సిపాలిటీలు	2,38,260
మొత్తం	3,01,890

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 14 : జిల్లాలో మొత్తం 27 మండలాలు, 13 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లు ఉన్నాయి. జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం మొత్తం 3,01,890 లక్షల అప్లికేషన్లు వచ్చాయి. అందులో అత్యధికంగా 2,38,260 మున్సిపాలిటీల్లోనే ఉన్నాయి. శంషాబాద్, శంకర్‌పల్లి మండలాల్లోనే దరఖాస్తులు ఎక్కువగా ఉన్నాయి. గ్రామ పంచాయతీ పరిధిలో 63,630 దరఖాస్తులు వచ్చాయి. కోర్టు కేసులు రావడంతో ఆ ప్రక్రియ అప్పుడు ఆగిపోయింది. ఈ మేరకు కొందరు కోర్టు ఉత్తర్వులకు లోబడి ఫీజు చెల్లించి నిర్మాణాలకు అనుమతులు పొందారు. కానీ మెజారిటీ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

మూడు దశల్లో దరఖాస్తుల పరిశీలన

లే అవుట్ల కమబద్ధీకరణపై తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. మొత్తం మూడు దశల్లో అప్లికేషన్లను పరిశీలించి ఆమోదించాలని నిర్ణయించింది. ఇందుకోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) రూపొందించిన ప్రత్యేక అప్లికేషన్‌ను వినియోగించనున్నారు. దరఖాస్తులను మొత్తం మూడు దశల్లో వడపోసి ఆమోదించనున్నారు. సీజీజీ రూపొందించిన ప్రత్యేక అప్లికేషన్ ద్వారా ఈ ప్రాసెస్ నిర్వహించనున్నారు. ప్లాట్ మార్కెట్ విలువ ప్రకారం ఫీజు నిర్ణయిస్తారు. అసైన్డ్ భూముల్లో ప్లాట్లు, లే అవుట్లు ఉంటే కలెక్టర్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. నిషేధిత జాబితాలోని భూములను ప్లాట్లుగా మార్చితే తిరస్కరిస్తారు. భూ గరిష్ట పరిమితి చట్టానికి భిన్నంగా ఉన్నవి, సరిహద్దులు తదితర వివాదాలు ఉంటే అనుమతిని నిరాకరిస్తారు. జీవో నెంబర్ 111లో నిర్దేశిత చెరువులు, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నవి, నాలాకు రెండు మీటర్ల లోపు ఉంటే వాటికి అనుమతి నిరాకరిస్తారు. అక్రమ ప్లాట్ల క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను ముందుగా మున్సిపాలిటీ, పంచాయతీల వారీగా వేరు చేస్తారు. తర్వాత గ్రామ సర్వే నెంబర్, కాలనీ, వార్డుల వారీగా విభజిస్తారు. ఇందుకోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ద్వారా ఆన్‌లైన్‌లో వడబోసేందుకు రంగం సిద్ధం చేశారు. ఆ తర్వాత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి స్థలాలను పరిశీలిస్తారు. అభ్యంతరాలుంటే తిరస్కరిస్తారు, అర్హత ఉన్నవాటికి క్రమబద్ధీకరణకు చెల్లించాల్సిన ఫీజు వివరాలను దరఖాస్తుదారుకు అందిస్తారు. అనంతరం వాటిని కలెక్టర్ అనుమతితో ఆమోదిస్తారు.

మొదటి దశ

ప్రత్యేకంగా రూపొందించిన సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అప్లికేషన్ ఆధారంగా మొదటి దశలో అప్లికేషన్లను పరిశీలిస్తారు. ప్రభుత్వ భూముల్లో చేసిన లే అవుట్లు, వివాదాస్పద భూముల్లో చేసిన లే అవుట్లకు సంబంధించిన అనుమతులను ఈ దశలోనే ఆపేస్తారు. ధరణి పోర్టల్‌లో ఉన్న వివరాలు, సర్వే నంబర్ల ఆధారంగా ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న వివరాలను ఇందుకోసం పరిశీలిస్తారు. లే అవుట్ వేసిన భూమి సమగ్ర వివరాలను గుర్తించి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, నీటిపారుదల శాఖ ఏఈ, పంచాయతీ ఈవో తదితర అధికారులతో కూడిన ప్రత్యేక బృందాలతో క్షేత్రస్థాయి పరిశీలన చేస్తారు. ఈ బృందం ఈ భూమి ప్రభుత్వానికి సంబంధించినదా? కోర్టు వివాదాలు ఉన్నాయా? అన్న వివరాలను పరిశీలిస్తుంది. ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌లో ఈ వివరాలను నమోదు చేస్తారు.

రెండో దశలో..

మొదటి దశలో క్లియర్ అయిన అప్లికేషన్లను ఈ దశలో పరిశీలిస్తారు. టౌన్ ప్లానింగ్, పంచాయతీ అధికారులు ఈ అప్లికేషన్లను పరిశీలిస్తారు. లే అవుట్ వివరాలు, నిబంధనల ప్రకారం ఖాళీ స్థలం వదిలేశారా? రోడ్లను నిర్మించారా? తదితర టెక్నికల్ అంశాలను ఈ దశలో పరిశీలిస్తారు. అన్నీ సరిగా ఉన్నాయని భావిస్తే.. ఆ దరఖాస్తుకు క్రమబద్ధీకరణ ఫీజును డిసైడ్ చేస్తారు. దరఖాస్తుదారులు ఫీజు చెల్లించిన మూడో దశకు అప్లికేషన్‌ను ఫార్వర్డ్ చేస్తారు.

మూడో దశలో..

ఇది ఫైనల్ దశ. మొదటి రెండు దశలను దాటి వచ్చిన అప్లికేషన్లను ఈ దశలో పరిశీలిస్తారు. మున్సిపల్ కమిషనర్లు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్లు, అదనపు కలెక్టర్లు ఈ దశలో అప్లికేషన్లను పూర్తిస్థాయిలో పరిశీలిస్తారు. లోపాలు ఉంటే రిజెక్ట్ చేస్తారు. లేకుంటే అనుమతి కోసం సంబంధిత అధికారులకు పంపిస్తారు.

మూడు నెలల్లో..

ఈ నెల మొదటి వారంలోనే ఎల్‌ఆర్‌ఎస్ ప్రాసెస్‌ను ప్రారంభించి మూడు నెలల్లో క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఇందుకోసం అన్ని జిల్లాల కలెక్టర్లు, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ కమిషనర్లు, రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు, పంచాయతీ, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు చొరవ తీసుకోవాలని సూచించింది.

నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్నాం



ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఆన్‌లైన్‌లో డబ్బులు కట్టి నాలుగేళ్లు అవుతుంది. నాటి నుంచి నేటి వరకు ఎల్‌ఆర్‌ఎస్ కోసం వేచి చూస్తున్నాను. తర్వగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలి. ప్రభుత్వ గైడ్‌లెన్స్ వచ్చాక కూడా ఆలస్యం జరుగుతోంది.

- మల్గని నరేందర్‌గౌడ్, మల్కాపూర్, చేవెళ్ల మండలం

సీజనల్ వ్యాధులపై ఇంటింటి సర్వే చేపట్టాలి

- కలెక్టర్ శశాంక
- శివరాంపల్లిలో ఆసుపత్రుల తనిఖీ



మందు సీసాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 14 : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇంటింటి సర్వే నిర్వహించి కేసులు గుర్తించాలని కలెక్టర్ శశాంక వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం శివరాంపల్లిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్యం, మందుల గురించి అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్, ఫార్మసీ స్టోర్, డాక్టర్ల గదితో పాటు రోగులకు పరీక్షలు చేసే గదిని పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి ఏయే కాలనీల నుంచి ఎంత మంది రోగులు వస్తారని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వచ్చిన వారికి సరైన వైద్యం అందించాలని డాక్టర్లకు, సిబ్బందికి సూచించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య పరీక్షల వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. డాక్టర్లు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని వెద్యాధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ రాములు, డాక్టర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

వసతి గృహాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేకాధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. వసతి గృహాలలో మౌలిక సదుపాయాలపై ఆయన బుధవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రత్యేకాధికారులు ప్రతి వారం వారికి కేటాయించిన హాస్టళ్లలో తనిఖీ నిర్వహించి, తాగునీటి వసతి, విద్యార్థులకు అందుతున్న ఆహారం, మరుగుదొడ్ల సదుపాయం వంటి వాటిని పరిశీలించి.. వాటికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. విద్యార్థులకు సీజనల్ వ్యాధులు సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తరచూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా హాస్టల్ విద్యార్థులకు హెల్త్ క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. హాస్టళ్లలో మర్మమతులు చేయించాల్సిన కిటికీలు, డోర్లు, విద్యుత్ సరఫరా వంటి వాటికి అధిక ప్రాధాన్యత ఇస్తూ వెంటనే చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, వివిధ శాఖల జిల్లా అధికారులు రామారావు, రామేశ్వరీ దేవి, నవీన్ కుమార్ రెడ్డి, సీపీఓ సౌమ్య, పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్పీ సాయి చైతన్య



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ, అధ్యాపకులు

చేవెళ్ల, ఆగస్టు 14 : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్పీ సాయి చైతన్య తెలిపారు. బుధవారం చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాలలో యాంటీ నార్కోటిక్ బ్యూరో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ సాయిచైతన్య మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగంపై పోలీస్ శాఖ ఉక్కుపాదం మోపుతుందన్నారు. డ్రగ్స్ అమ్మినా కొనుగోలు చేసినా కేసులు నమోదు చేస్తామన్నారు. డ్రగ్స్ అమ్మకాలపై పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించి విద్యార్థులచే ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ హరిచంద్రా రెడ్డి, సీఐలు గోపి శ్రీనివాస్, భూపాల్ శ్రీధర్, రమేష్‌నాయుడు, ఆసుపత్రి డీన్ సత్యనారాయణ, మెడికల్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ రాణి పాల్గొన్నారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు హైకోర్టు నోటీసులు

- ఎలిమినేడు భూ సేకరణ వ్యవహారంలో జారీ చేసిన కోర్టు
- ఈ నెల 30న కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశం
- లేకుంటే చర్యలు తప్పవన్న న్యాయస్థానం



ఇబ్రహీంపట్నం, ఆగస్టు 14: ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడులో భూసేకరణ అంశంపై హైకోర్టు ఆదేశాలను ధిక్కరించినందుకు గాను జిల్లా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జీఎన్‌వీ రాజుకు కోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ నెల 30న హైకోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని కూడా అందులో పేర్కొన్నారు. వివరాల్లోకి వెళితే.. సర్వే నెంబర్లు.. 166, 420, 492, 512లలో మొత్తం 671.29 ఎకరాలు ఉండగా.. గతంలో 504 మంది పేదలకు ఈ భూములపై అసైన్‌మెంట్ పట్టాలిచ్చారు. ఈ భూములనే అప్పటి ప్రభుత్వం టీఎస్‌ఐఐసీ ద్వారా ఏరోస్పేస్ పార్కు కోసం భూసేకరణకు పూనుకుంది. 571.29 ఎకరాలకు సంబంధించి 481 మంది రైతుల నుంచి భూసేకరణ చేయాలని నిర్ణయించి 2018లో నోటిఫికేషన్ వేశారు. ఎకరాకు రూ.12 లక్షల చొప్పున పరిహారం ప్రకటించి 2019లో భూసేకరణకు పూనుకున్నారు. కాగా, ఎక్కువ శాతం రైతులు పరిహారం పొందారు. అయితే, తమకు అసైన్డ్ పట్టా కన్నా తక్కువ చూపుతూ పరిహారం ఇవ్వచూపుతున్నారని పలువురు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. అంతేగాకుండా ఆర్‌అండ్‌ఆర్ (పునరావాసం-పునర్నిర్మాణం) చట్టం ప్రకారం తమకు పరిహారం అందించాలని కూడా పలువురు రైతులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఇదే కోవలో రైతులు కొట్టంల మల్లయ్య, కొట్టంల నర్సింహ, కొట్టంల భాషాలు తమ అసైన్డ్ పట్టాకు అధికారులు విస్తీర్ణం తక్కువచేసి పరిహారం చూపుతున్నారని, పూర్తిస్థాయిలో పరిహారం అందించాలని కోర్టును ఆశ్రయించారు. ఇందుకు సంబంధించి మూడు నెలల్లో అవార్డు పాస్‌చేసి పరిహారం ఇవ్వాలంటూ హైకోర్టు న్యాయమూర్తి 2023 డిసెంబరులో ఉత్తర్వులిచ్చారు. అయినా, నేటికీ ఆ రైతులకు పరిహారం అందకపోవడంతో వారి తరపు న్యాయవాది శ్రవణ్‌కుమార్‌రెడ్డి కోర్టులో పిటిషన్ వేశారు. దాంతో ఈనెల 30న హైకోర్టుకు హాజరు కావాలంటూ న్యాయమూర్తి కె.శరత్ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు కోర్టు ఈనెల 2న నోటీసులు జారీచేసింది. కాగా, మరికొంత మంది రైతులకు సంబంధించి కూడా కోర్టు ఉత్తర్వులు రానున్నట్లు తెలిసింది.



పుష్పలతారెడ్డి సాగు చేసిన కాకరతోట

వేలల్లో పెట్టుబడి.. లక్షల్లో ఆదాయం

- సేంద్రియ సాగుతో లాభాలు గడిస్తున్న మహిళ
- రెండెకరాల్లో కాకర, రెండెకరాల్లో టమాట
- డిమాండ్ ఉన్న సమయంలో భారీగా దిగుబడి
- రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న సాధారణ గృహిణి
- యాచారం మండలం మొండిగౌరెల్లిలో సాగు





యాచారం, ఆగస్టు 14: ఆమె సాధారణ గృహిణి. ఇంట్లో కాలక్షేపం చేయకుండా సేంద్రియ సాగుపై దృష్టి సారించింది. మెట్ట పంటలను సాగు చేసుకుంటూనే కూరగాయల సాగు చేస్తూ అధిక ఆదాయాన్ని గడిస్తూ ఔరా అనిపిస్తున్నారు. రెండేళ్ల క్రితం సేంద్రియ సాగులో జామ, మామిడి తోటలు సాగు చేసి మంచి లాభాలు గడించారు. నేడు అదే దారిలో టమాట, కాకర పంటలను సాగు చేసి మంచి దిగుబడిని సాధించారు. కేవలం రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి రూ.లక్షల్లో ఆదాయాన్ని గడిస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

డిమాండ్ ఉన్న పంటల సాగుతో..

రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మొండిగౌరెల్లికి చెందిన కొలన్ పుష్పలతారెడ్డి, ఆమె భర్త బుచ్చిరెడ్డి దంపతులకు 15 ఎకరాల పొలం ఉంది. ఆమె ఇటీవల రెండు ఎకరాల్లో తీగజాతి టమాటను సేంద్రియ ఎరువులతో సాగు చేసింది. ఈ సాగుకు రూ.1.8 లక్షల పెట్టుబడి పెట్టింది. దిగుబడి బాగా రావడంతో సుమారు రూ. 6 లక్షల ఆదాయం వచ్చింది. మార్కెట్లో టమాటకు మంచి డిమాండ్ ఉన్న సమయంలో పంట రావడంతో ఆశించిన దానికంటే రెండింతల రాబడి వచ్చింది. ఆమెతో పాటు మరో వ్యక్తిని కూలీగా పెట్టుకొని పని చేయడం గమనార్హం. అలాగే కాకరకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని గమనించి రెండు ఎకరాలలో కాకర పంటను సాగు చేసింది. కాకర తీగ నిలపడానికి కర్రల సాయంతో చిన్నపాటి పందిరి వేసింది. పందిరి మధ్య ఇద్దరు వ్యక్తులు సులువుగా తిరిగేట్లు బాట ఉండేలా ఏర్పాటు చేశారు. రూ. 15వేలతో కాకర విత్తనాలు కొనుగోలు చేసి, విత్తనాలు నాటడం కోసం రూ.2 వేలు ఖర్చుచేసింది. పందిరి ఇతర అవసరాలకు మొత్తంగా రూ.1.2 లక్షల పెట్టుబడి పెట్టింది. తీరా కాత చేతికందడంతో ఇప్పటి వరకు రూ.4.5 లక్షల ఆదాయం వచ్చింది. మరో మూడు నెలలకు పైగా కాత వస్తుంది. ఇదే కాకుండ మరో రూ.రెండు లక్షల అదనపు ఆదాయం వస్తుందని పుష్పలత వివరించారు.



కాకరకాయలు

సేంద్రియ ఎరువుల తయారీ ఇలా..


కానుగ, తంగేడు, జిల్లేడు, వేప, మామిడి ఆకులను బాగా మురగపెట్టింది. వాటితో పాటు కిలో శనగపిండి. రెండు కిలోల బెల్లం. ఒక రాగిచెంబును దాంట్లో వేసి వారం రోజుల పాటు వాటిన్నింటిని బాగా మురగపెట్టింది. ఇలా వారం రోజుల పాటు బాగా కలపాలి. వాటిన్నింటిని కలిపే సమయంలో కేవలం ఒక పక్క మాత్రమే కలపాలి. రెండో పక్క కదలకుండా చూడాలి. ఇలా చేయడంతో నాణ్యత బాగా ఉంటుంది. రెండుమార్లు మందులు కలిపిన తరువాత పంటలకు సోకే చీడపీడలను నివారించడం కోసం పిచికారీ చేసుకుంటే ఎలాంటి పురుగులు, ఇతర క్రిమికీటకాల నుంచి పంటలను కాపాడుకోవచ్చు. సేంద్రియ ఎరువులతో కూరగాయల సాగు చేయడంతో పంట ఎక్కువ రోజులు నిల్వ చేసుకునేందుకు వీలుంది. పంటలో పోషకపదార్థాలు అధికంగా ఉండటంతో మనిషి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ఆమె వివరించారు. టమాట, కాకర పంటలకు కేవలం డ్రిప్ పరికరాలతో తోటలకు నీరందించారని తెలిపారు. దీంతో నీరు వృథా కాకుండా ఉంటుందన్నారు. కాగా, వారు సేంద్రియ ఎరువులతో ఇటీవల రూ.20 వేల పెట్టుబడితో ఎకరం వరి సాగు చేసి రూ.70వేల ఆదాయం సంపాదించారు.

సేంద్రియ విధానంపై అవగాహన కల్పించాలి



సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలి. ఉద్యానవనశాఖ అధికారులు పల్లెపల్లె తిరిగి సేంద్రియ ఎరువుల తయరీపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయాలి. నేను జామ, మామిడి తోటలతో మంచి లాభాలు సాధించాను. దీంతో శాస్త్రవేత్తలు నన్ను ఘనంగా సత్కరించారు. నా భర్త సహకారంతో సేంద్రియ ఎరువులు వాడి టమాట, కాకర పంటలు సాగు చేసి మంచి లాభాలు గడించాను. వరి పంట కూడా కేవలం సేంద్రియ ఎరువులు వేసి పండించాం.

- కొలన్ పుష్పలత, రైతు



లైంగికదాడి ఘటనపై విచారణ

బొంరాస్‌పేట్, ఆగస్టు 14: బొంరాస్‌పేట్ మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన అంధ బాలికపై లైంగికదాడి ఘటన కలకలం రేపింది. బాలిక హైదరాబాద్‌లోని అంధుల పాఠశాలలో ఉంటోంది. గత నెల 6న పాఠశాలలో పారిశుధ్య పనులు నిర్వహించే యువకుడు బాలికపై లైంగికదాడికి పాల్పడినట్లు తేలింది. ఈ సంఘటనపై శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పందించడంతో అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం బాలిక కుటుంబీకులను స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ క్రాంతి, డీడబ్ల్యూవో వెన్నెల కలిసి మాట్లాడారు. బాలిక ఆరోగ్య పరిరక్షణ కోసం అధికారులు రూ.25వేలు అందజేశారు.

ఘట్‌కేసర్ ఆస్పత్రిలో కొద్దిసేపు వైద్య సేవలకు అంతరాయం

ఘట్‌కేసర్, ఆగస్టు 14 : పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతలో వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనకు నిరసనగా బుధవారం ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రిలో కొద్దిసేపు వైద్యసేవలను నిలిపివేసి వైద్యులు నిరసన తెలిపారు. ఆస్పత్రిలో అంతా నిశ్శబ్దంగా ఉండడంతో ఏమైందని రోగులు, వారి అటెండెంట్లు కొనుక్కున్నారు. పేషెంట్లు ఓపీ చిట్టీల కోసం వేచి ఉన్నారు. 20నిముషాల్లో ఓపీ తిగిరి ప్రారంభమైంది. కోల్‌కతాలో వైద్య విద్యార్థినిని హత్యచేశారని, ఈ ఘటనకు నిసరనగా కొద్దిపేపు వైద్యసేవలు నిలిపివేశామని వైద్య సిబ్బంది తెలిపారు.

స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి

పరిశ్రమ ఎదుట తండావాసుల ధర్నా • మద్దతు తెలిపిన పార్టీల నాయకులు



ఎమ్ఎస్ఎన్ పరిశ్రమ గేటు ఎదుట ధర్నా నిర్వహిస్తున్న తండా వాసులు

నందిగామ, ఆగస్టు 14: పరిశ్రమలో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని తండా వాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు మండల పరిధిలోని బండకుంట తండా సమీపంలోని ఎమ్ఎస్ఎన్ పరిశ్రమ గేటు ఎదుట బుధవారం తండావాసులతో పాటు స్థానిక యువకులు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. స్థానికులకు కాకుండా స్థానికేతరులకు ఉద్యోగాలు ఇస్తున్నారని ఆరోపించారు. చుట్టుపక్కల తండాల వారికి కొంతమందికి ఉద్యోగావకాశాలు కల్పించిన పరిశ్రమ యాజమాన్యం కావాలనే వారిని ఇబ్బందులకు గురిచేస్తుందని, ఎలాంటి కారణం లేకుండానే విధుల నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు. పరిశ్రమలో ఎలాంటి కార్మిక చట్టాలు అమలు కావడం లేదని, గిరిజనులపై పరిశ్రమ యాజమాన్యానికి చిన్నచూపు ఎందుకని మండిపడ్డారు. స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలని, తండాలలో కనీస వసతులు కల్పించాలని, కాంట్రాక్ట్ బేస్డ్ కాకుండా పరిశ్రమ తరఫున పర్మినెంట్ ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాకు వివిధ పార్టీల నాయకులు జిల్లెల్ల వెంకట్‌రెడ్డి, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, దేపల్లి కుమార్‌గౌడ్, సుమన్, అంజయ్య ఇతర నాయకులు మద్దతు తెలిపారు.

పిల్లలకు సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చాలి



మాట్లాడుతున్న హరికిషన్ వేదాలంకార్

చౌదరిగూడ, ఆగస్టు 14: విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించి, సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చుకునేలా తల్లిదండ్రులు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆర్య ప్రతినిధి సభ మంత్రి హరికిషన్ వేదాలంకార్ ఆర్య సూచించారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని ఆర్య సమాజ్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 45వ శ్రవణవేద ప్రచార సత్సంగం ముగింపు కార్యక్రమంలో భాగంగా చివరి యజుర్వేద పారాయణ మహాయజ్ఞం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ సమాజంలో శాంతియుత సహజీవనము పెంపొందించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. లోకకల్యాణార్థం వాతావరణ శుద్ధి, సకాలంలో వర్షాలు, పాడి పంటలు, దేశ సమైక్యతకు వేదాలు, యజ్ఞములే మూలమని తెలిపారు. 45 సంవత్సరాలుగా ఈ కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషమని అన్నారు. ఆర్యసమాజ్ పాలక వర్గాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో యజ్ఞ బ్రహ్మలు అరవిందశాస్త్రి, డాక్టర్ వసుధాశాస్త్రి, వీహెచ్‌పీ తెలంగాణ రాష్ట్ర సేవా ప్రముఖ్ శ్రీవాణి, సాంస్కృతిక సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు బండారి రమేష్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు మచ్చ సుధాకర్‌రావు, కోసేరి శ్రీనివాస్, ఆకారపు యాదగిరి, చిన్నయ్య, ఆకారపు నాగరాజు, రఘునందన్‌చారి, బస్వరాజ్, బీజేపీ నాయకులు బాబయ్య, భూపాలచారి, శివకుమార్, బాలబ్రహ్మచారి, ఆర్య సమాజ్ పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

'ఎల్ఆర్ఎస్'పై దృష్టి సారించాలి

జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా



మేడ్చల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రాసెసింగ్‌ను పక్కాగా నిర్వహించాలని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) రాధిక గుప్తా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. కచ్చిత ప్రణాళికతో సర్వే చేయాలని, సకాలంలో పరిష్కరించేందుకు శిక్షణతో కూడిన సూచనలు చేశారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రాసెసింగ్‌కు రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇరిగేషన్, పంచాయతీ అధికారులతో బృందాలుగా ఏర్పాటు చేసి మొబైల్‌ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందుపర్చేలా కావాల్సిన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దరఖాస్తులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, పంచాయతీ కార్యదర్శులు, టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్‌కు పోయేదెట్లా?



కొత్తూర్ అండర్‌పాస్ వద్ద ఏర్పాటుచేసిన బారికేడ్లు

- కొనసాగుతున్న ప్రధాన రోడ్డు నిర్మాణం పనులు
- జంక్షన్ల మూసివేత.. ప్రజల ఇక్కట్లు

కొత్తూర్, ఆగస్టు 14: మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరిస్తూ నిర్మాణ పనులు జరగడం శుభపరిణామమే అయినా.. మండల కేంద్రానికి వచ్చే ప్రధాన జంక్షన్లను మూసివేయడంతో ప్రజలు లబోదిబో మంటున్నారు. స్థానిక ప్రధాన రోడ్డు గోతులమయంగా మారడం, ఇటీవల కురిసిన వర్షాలకు గోతుల్లో వర్షపు నీరు నిలవడంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రజా సమస్యలను దృష్టిలో పెట్టుకుని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, సంబంధిత శాఖ అధికారులతో కలిసి రోడ్డును పరిశీలించి నాలుగు లేన్లుగా విస్తరించేందుకు నిధులు మంజూరు చేయించారు. యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నారు. పదిహేను రోజుల క్రితం పనులు చకచకా ప్రారంభమైనాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. నిర్మాణ పనులకు అడ్డంకులు ఎదురైతున్నాయనే ఉద్దేశ్యంతో గత మూడు రోజులుగా ట్రాఫిక్ పోలీసులు ప్రధాన జంక్షన్లను బారికేడ్లతో మూసివేశారు. కొత్తూర్ వైజంక్షన్, అండర్‌పాస్, జేపీ దర్గా రోడ్డు జంక్షన్‌ను మూసివేశారు. కాగా, వైజంక్షన్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయనే ఉద్దేశంతో నెల రోజుల క్రితమే పోలీసులు బారికేడ్లతో జంక్షన్‌ను మూసివేసి అండర్‌పాస్ గుండా వాహనాలను తరలించారు. ఇప్పుడు రోడ్డు నిర్మాణం కారణంగా అండర్‌పాస్‌ను కూడా మూసివేయడంతో సమస్య తీవ్రమైంది. దాంతో హైదరాబాద్ నుంచి కొత్తూర్ మీదుగా షాద్‌నగర్ వచ్చే ఆర్టీసీ బస్సులతో పాటు, ఇతర వాహనాలు బైపాస్ రోడ్డు ద్వారా వెళ్తున్నాయి. ప్రయాణికులు బైపాస్ వద్ద దిగి కొత్తూర్ టౌన్‌లోకి కాలినడకన రావాల్సి వస్తోంది. అలాగే జేపీ దర్గాకు వెళ్లే ప్రయాణికులు బైపాస్‌కు వెళ్లాల్సి వస్తుంది. కొత్తూర్ టౌన్ నుంచి బైపాస్‌కు వెళ్లే వాహనాలు తిమ్మాపూర్‌నకు వెళ్లి యూటర్న్ చేసుకుని రావాల్సి వస్తుంది. దాంతో రానుపోను 5 కిలోమీటర్లు ఎక్కువ దూరం వెళ్లక తప్పడం లేదు. జంక్షన్ల మూసివేతతో విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఆసుపత్రులకు వెళ్లేవారు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంబులెన్సులకు సైతం సమయం వృథా అవుతోంది. ముఖ్యంగా కొత్తూర్ పారిశ్రామిక ప్రాంతం కావడంతో నిత్యం వందలాది వాహనాలు వచ్చి వెళ్తుంటాయి. కొత్తూర్ సమీపంలో ఐవోసీఎల్ ప్లాంట్ ఉండడంతో భారీ వాహనాలు వచ్చి వెళ్తుంటాయి. ముఖ్యంగా అండర్‌పాస్ మూసి వేయడంతో భారీ వాహనచోదకులు కిలోమీటర్ల మేర బైపాస్ రహదారిలో వెళ్లి గమ్యస్థానాలకు చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. జంక్షన్ల మూసివేత అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత శాఖ అధికారులు స్పందించి ప్రజా సమస్యలను దృష్టిలో పెట్టుకుని రోడ్డు నిర్మాణాన్ని ఒక వైపు పూర్తి చేసి, మరో వైపు నిర్మాణాన్ని చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కొత్తూర్-జేపీ దర్గా రోడ్డును బారికేడ్లతో మూసివేసిన పోలీసులు

మహేశ్వరం ప్రభుత్వాసుపత్రిలో సకల సౌకర్యాలు

- 50 పడకలకు హాస్పిటల్‌గా తీర్చిదిద్దుతాం
- మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 14 : ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో మహేశ్వరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సకల సౌఖర్యాలు కల్పించి మరో రెండు నెలల్లో 30 పడకల నుంచి 50 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్ది జిల్లాలోనే ఆదర్శ ఆసుపత్రిగా తీర్చిదిద్దనున్నట్లు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్షారెడ్డి(కేఎల్లార్) తెలిపారు. బుధవారం మహేశ్వరంలోని ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన ఆయన ఆసుపత్రిలో సమస్యల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్, పరికరాలు, వాటర్ ప్లాంట్, రోగులకు నిత్యం అందుబాటులో ఉండేలా ప్రైవేటు అంబులెన్స్ సౌకర్యం, పోస్టుమార్టం కేంద్రం వంటి సమస్యలు ప్రధానంగా ఉన్నాయని వైద్యులు ఆయన దృష్టికి తెచ్చారు. తమ ట్రస్టుతో పాటు అమెజాన్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడి ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను మరో 60 రోజుల్లో పరిష్కరిస్తానని తెలిపారు. అదేవిధంగా మండలంలోని విచ్చలవిడిగా చెలామని అవుతున్న ఆర్ఎంపీల ఆగడాలను అరికట్టాలని మహేశ్వరం నాయకులు కొందరు కేఎల్లార్ దృష్టికి తీసుకెళ్లగా.. ఉన్నతాధికారులతో మాట్లాడి ఆర్ఎంపీల ఆగడాలను అరికట్టే యత్నం చేస్తానన్నారు. ప్రజలందరు ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్యం చేయించుకోవాలని సూచించారు. చిన్న సమస్యలకు కూడా ప్రైవేటు ఆసుపత్రులకు వెళితే.. రూ.వేలు, లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి దేప భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి, కూన యాదయ్య, విఠల్‌నాయక్, కృష్ణానాయక్, రాఘవేందర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఇస్రాయేలు, రాజునాయక్, శివ, అంద్యానాయక్, డి.శ్రీనివాస్‌రెడ్డి, అల్లె కుమార్, జంగయ్య, మురళీధర్‌రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ అమీర్ తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై డాక్టర్‌ను అడిగి వివరాలు తెలుసుకుంటున్న కేఎల్లార్

విత్తన జెండాలు భళా!

కూరగాయల విత్తనాలు, ఆవు పేడతో జాతీయ జెండాలు, రాఖీల తయారీ



విత్తనాలు, ఆవుపేడతో తయారు చేసిన జాతీయజెండాలు, రాఖీలు

తాండూరు, ఆగస్టు 14 : స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని దీర్ఘాయుష్ పూర్ణ సంస్థ స్వదేశీ విత్తనాలతో జాతీయ జెండాలను తయారు చేసింది. దేశభక్తి, పర్యావరణాన్ని పరిరక్షించుకోవడంలో భాగంగా స్వదేశీ కూరగాయల విత్తనాలు, ఆవుపేడతో జాతీయ జెండాలు, రాఖీలు తయారు చేయగా అవి ఆకట్టుకుంటున్నాయి. 'స్వదేశీ విత్తన జెండాలు భూమికి బహుమానాలు' అనే నినాదంతో వీటి రూపొందించామని ఆర్గనైజర్, తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కె.విజయలక్ష్మి తెలిపారు. వినియోగానంతరం వీటిని నేలలో పడేస్తే ఎరువుగా మారుతుందన్నారు. వీటిని పెరట్లో వేస్తే విత్తనాలు మొలకెత్తి ఆర్గానిక్ కూరగాయలను కూడా అందిస్తాయని తెలిపారు. విత్తన జెండాలు, రాఖీలు ధరించి ప్రకృతిని కాపాడుకుందామని ఆమె పిలుపునిచ్చారు.

కొర్విచెడ్‌ఘని పాఠశాలలో మధ్యాహ్న భోజనం బంద్



కొర్విచెడ్ పాఠశాలలో విచారణ జరుపుతున్న ఎంపీడీవో యాదయ్య

- వండిపెట్టే మహిళ ఇంట్లో టీబీ పేషెంట్ ఉన్నాడంటున్న గ్రామస్తులు
- ఇంటి భోజనమే పంపిస్తున్న వైనం
- ఆరా తీసిన ఎంపీడీవో

బషీరాబద్, ఆగస్టు 14: మండలంలోని కొర్విచెడ్‌ఘని పాఠశాలలో 14 రోజులుగా విద్యార్థులకు మధాహ్న భోజనం పెట్టడంలేదు. బుధవారం పాఠశాలలో పనుల పరిశీలనకు వచ్చిన ఎంపీడీవోకు మధ్యాహ్న భోజనంపై గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో హెచ్ఎం నాగరాజ్, మరో ఉపాధ్యాయుడు విధులు నిర్వర్తిస్తున్నారు. 63 మంది విద్యార్థులున్నారు. అయితే మధాహ్న భోజనం వండే ఏజెన్సీ మహిళ కుటుంబంలో ఒకరికి టీబీ పాజిటివ్ వచ్చిందని, ఆ మహిళ వండితే తమ పిల్లలు తినరని తల్లిందండ్రులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. పిల్లల ఆరోగ్యం దృష్ట్యానే ఇలా అంటున్నామని వారు చెప్పినట్లు తెలిసింది. స్కూల్లో వండిన అన్నం తినొద్దని పిల్లలకు టిఫిన్ బాక్సు లు ఇస్తున్నా రు. కొందరు విద్యార్థులు మధ్యాహ్నం అన్నానికి ఇళ్లకు వెళ్తున్నారు. కొందరు కార్మికుల పిల్లలు పస్తులుంటున్నారు. ఈ విషయమై స్కూల్ ఎచ్ఎం క్లస్టర్ హెచ్ఎం, ఎంఈవోల దృష్టికి తీసుకెళ్లలేదు. అప్పుడే విషయం తెలియడంతో ఎంపీడీవో యాదయ్య ఎచ్ఎం నిర్లక్ష్యంపై నిలదీశారు. ఈ విషయమై స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ, తల్లిదండ్రులతో సమావేశం పెట్టానని హెచ్ఎం తెలిపారు. దీనిపై ఏం చేద్దామని తల్లిదండ్రులను ఎంపీడీవో అడిగారు. వేరే మహిళతో వండించాలని వారు కోరారు. దీనిపై క్లస్టర్ హెచ్ఎం పార్వతిదేవి, ఎంఈవో సుధాకర్‌రెడ్డి స్పందిస్తూ.. పాఠశాలలో భోజనం తినడంలేదని హెచ్ఎం తమ దృష్టికి తేలేదన్నారు. ఎంపీడీవో విచారణ సమయంలో నవాంద్గీ ప్యాక్స్ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, నాయకులు హన్మంతు, లక్ష్మణ్‌రావు తదితరులు ఉన్నారు.

అంతెత్తున తిరంగా

- తాండూరులో 30 మీటర్ల ఎత్తున జాతీయ జెండా
- నేడు ఆవిష్కరించనున్న ఎమ్మెల్యే
- రూ.25లక్షల వ్యయంతో ఏర్పాటు



జాతీయ జెండా కోసం ఏర్పాటు చేసిన పోల్

తాండూరు, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవాన గురువారం తాండూరు పట్టణంలో ఎత్తైన జాతీయ జెండా ఆవిష్కరణ జరగనుంది. రాష్ట్రంలో ఏ మున్సిపాలిటీలోనూ ఏర్పాటు చేయని విధంగా తాండూరులో ఎత్తైన జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. 30.5మీటర్ల(100 ఫీట్లు) ఎత్తున జాతీయ జెండాను 78వ స్వాతంత్ర్య దినోత్సవాన తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్ రెడ్డి ఆవిష్కరిస్తారని మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్ తెలిపారు. రూ.25లక్షలతో ఈ జెండాను ఏర్పాటు చేశారు. జాతీయ జెండా పొడవు 35ఫీట్లు, వెడల్పు 25ఫీట్లు ఉంటుంది. రాత్రి వేళలలో జెండా జిగేల్ మనేలా పోల్‌కు 350వోల్టేజీ గల రెండు ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేశారు. వ్యాపార, వాణిజ్య కేంద్రంగా రెండు రాష్ట్రాల(తెలంగాణ, కర్ణాటక)కు కేంద్రంగా ఉన్న తాండూరులో ఎత్తైన జాతీయ జెండా ఏర్పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. జెండా ఆవిష్కరణకు ఎమ్మెల్యేతో పాటు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి.మహేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌లను ముఖ్య అతిథులుగా ఆహ్వానించారు. ఈ జెండాను, పోల్‌ను హైదరాబాద్‌కు చెందిన ఏజెన్సీ తయారు చేసింది. మున్సిపల్ ఇన్‌చార్జి డీఈఈ ఖాజా హుస్సేన్ ఆధ్వర్యంలో జెండా ఏర్పాట్లు జరిగాయి.

అంతారంలో అసైన్డ్ భూమి పరిశీలన



భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ తారాసింగ్, మున్సిపల్ కమిషన్ విక్రమ్‌కుమార్‌రెడ్డి

తాండూరు రూరల్, ఆగస్టు 14: మండల పరిధి అంతారంలో రైతులకు ఇచ్చిన అసైన్డ్ భూమిని బుధవారం అధికారులు పరిశీలించారు. అంతారంలోని ఎన్టీఆర్ కాలనీకి ఆనుకుని ఉన్న భూమిని తహసీల్దార్ తారాసింగ్, మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, సర్వేయర్ మహేష్ పరిశీలించారు. ఈ భూమిలో తాండూరు, పెద్దేముల్, యాలాల మండలాల తర్కారి భూముల్లో 30ఎకరాలను మార్కెట్ కమిటీ నిర్మాణానికి కేటాయించారు. ఇదే భూమిలో గతంలో ప్రభుత్వం అరుగురు రైతులకు 9ఎకరాలను అసైన్ చేసింది. అందులో రైతులు సాగు చేసుకుంటున్నారు. ఇదే భూమిలో మార్కెట్ కమిటీకి కేటాయించగా నిర్వాసిత రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అధికారులు భూమిని పరిశీలించారు. భూమికి పట్టా పాస్‌బుక్కులు ఉన్నాయని రైతులు తెలిపారు. సర్వే చేసి రైతులు భూములు కోల్పోతే పరిహారం ఇప్పిస్తామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

'ఉపాధి హామీ' బిల్లులు చెల్లించాలి



ఎంపీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొందుర్గు, ఆగస్టు 14: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలకు పది వారాలకు సంబంధించిన డబ్బులు వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య ఆధ్వర్యంలో కూలీలతో కలిసి ఎంపీవో లాలయ్యకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రతీ వారం కూలీల డబ్బులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారని, ఎన్నికలు ముగిసి పది వారాలు గడిచినా డబ్బులు ఖాతాలో వేయకపోవడానికి కారణమేంటో చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సంఘం నాయకులు కృష్ణ, చంద్రయ్య, సురేష్, వెంటయ్య, కిష్టయ్య, రేణమ్మ, రాజు, తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

యాచారం, ఆగస్టు 14 : అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మాటల్లో దింపి మంగళసూత్రాలు అపహరిస్తారని యాచారం ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి మహిళలకు సూచించారు. బుధవారం సాయంత్రం మహిళా కానిస్టేబుల్ సంతోషతో కలిసి సైకిల్‌పై మండల కేంద్రంలో పర్యటించారు. బస్టాండ్‌లో గుమిగూడి ఉన్న మహిళలకు చైన్‌స్నాచింగ్‌లపై అవగాహన కల్పించారు. ఇంట్లో విలువైన ఆభరణాలు పెట్టకుండా బ్యాంక్ లాకర్లలో దాచుకోవాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ నెంబర్ అడిగి బ్యాంక్ ఖాతాలో ఉన్న ధనం కాజేస్తారని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి చాకెట్లు ఇచ్చి పిల్లలను అపహరించే ప్రమాదముందని ఈ సందర్భంగా వారు సూచించారు.

హిందువులపై దాడులను అరికట్టాలి

- బంగ్లాదేశ్‌లో అల్లర్లపై

బీజేపీ, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

షాద్‌నగర్, ఆగస్టు 14: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని విశ్వహిందూ పరిషత్, బీజేపీ డిమాండ్ చేసింది. బుధవారం షాద్‌నగర్ పట్టణ రైల్వేస్టేషన్ నుంచి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది భాస్కర్‌రెడ్డికి దాడులు ఆపాలని కోరుతూ వినతిపత్రం అందజేసింది. అనంతరం వీహెచ్‌పీ తెలంగాణ, ఏపీల క్షేత్ర ప్రముఖ్ బండారి రమేష్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో మైనార్టీలుగా ఉన్న హిందువులపై దాడులు పెరిగి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హిందూ ధర్మాన్ని విచ్ఛిన్నం చేయడానికి కమ్యూనిస్ట్ దేశాలు కుట్ర పన్నడంతో పాటు ఆయా దేశాలకు నిధులు కూడా సమకూరుస్తున్నాయని ఆరోపించారు. స్వదేశంలో సైతం హిందూ ధర్మాన్ని నాశనం చేసేందుకు కమ్యూనిస్ట్‌లు కూడా కుట్ర చేస్తున్నారన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పాకిస్తాన్, బంగ్లాదేశ్ లాంటి చిన్న దేశాలకు స్వేచ్ఛా జీవితాలను అందించిన హిందువులపై దాడులకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. బీజేపీ, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నేతలు అందె బాబయ్య, చెట్ల వెంకటేష్, రుషికేష్, నాగిళ్ల కుమార్, నాగిళ్ల ప్రభాకర్ తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


చేవెళ్ల : ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల నాయకులు, ప్రజలు

చేవెళ్ల : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను తక్షణమే ఆపాలని చేవెళ్లలోని హిందూ సంఘాల నాయకులు తెలిపారు. బంగ్లాదేశ్‌లో దాడులకు నిరసనగా హిందూ సంఘాలు, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్‌ల ఆధ్వర్యంలో చేవెళ్ల పట్టణ కేంద్రంలోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై భారీ ర్యాలీ తీశారు. చేవెళ్ల బంద్‌కు పిలుపు నివ్వడంతో పట్టణ కేంద్రంలోని అన్ని వ్యాపార దుకాణాలు స్వచ్ఛందంగా బంద్ చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో రోజురోజుకూ హిందువులపై దాడులు పెరగడం చాలా బాధకరమన్నారు. హిందూ సంఘాలు, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ కళాశాలల విద్యార్థులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు.


షాద్‌నగర్ : ర్యాలీలో పాల్గొన్న వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు

అట్టహాసంగా 'హర్ ఘర్ తిరంగా'


ఆమనగల్లు : ర్యాలీలో బీజేపీ, బీజేవైఎం నాయకులు, జెండాకు వందనం చేస్తున్న శ్రీవర్ధన్‌రెడ్డి, పీవీఆర్

ఆమనగల్లు, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రధాని మోదీ పిలుపు మేరకు ఆమనగలు పట్టణంలో బుధవారం బీజేవైఎం ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేవైఎం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కో-కన్వీనర్ రవిరాథోడ్ ఆధ్వర్యంలో ర్యాలీలో బీజేవైఎం, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థినీవిద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, ఎస్సై బి.వెంకటేశ్‌లు ర్యాలీని ప్రారంభించారు. మువ్వెన్నెల జెండాలను చేబూని ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర సమర యోధులను స్మరిస్తూ ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ కొనసాగింది. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ గోరటి నర్సింహ, బీజేపీ పట్టణాధ్యక్షుడు శ్రీకాంత్ సింగ్, కౌన్సిలర్ ఝాన్సీ శేఖర్, బీజేపీ నాయకులు ప్రజలు పాల్గొన్నారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాలతోపాటు అన్ని గ్రామాల్లో పంద్రాగస్టు వేడుకలకు ప్రభుత్వ కార్యాలయాలు, స్కూళ్లు, ప్రైవేటు సంస్థలకు చెందిన కార్యాలయాల ఆవరణలను త్రివర్ణ తోరణాలతో అలంకరించారు. జెండా పండుగను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు గావించారు.

షాద్‌నగర్ అర్బన్ : హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి నిర్వహించారు. బుధవారం వారి వారి ఇంటిపై జాతీయ జెండాను ఆవిష్కరించి, వందన సమర్పణ చేశారు. ప్రతి భారతీయుడు కూడ తమ తమ ఇండ్లపై జాతీయ జెండాలను ఆవిష్కరించి, దేశ భక్తిని చాటాలని కోరారు.

గ్రామాల సర్వతోముఖాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


కసిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తలకొండపల్లి, ఆగస్టు 14: గ్రామాల సర్వతోముఖాభివృద్ధే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రజాభీష్టానికి కనుగుణంగా ప్రభుత్వం పథకాలు రూపొందించి అమలు చేస్తుందన్నారు. చుక్కాపూర్ నాయకులు బుధవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో అంతర్గత మురుగు కాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణం, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు నూతన భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. గ్రామంలో పాడి పరిశ్రమ పై ఆధారపడి అనేక మంది రైతులు జీవనం సాగిస్తున్నారని ప్రత్యేక పశువైద్యాధికారిని నియమించాలని, చుక్కాపూర్ నుంచి చెన్నారం వరకు పాడైన బీటీ రోడ్డును మరమత్తు చేసి ఆధునీకరించాలని అభ్యర్థించగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. నాయకులు జక్కు శ్రీనివాస్‌రెడ్డి, చంద్రకుమార్, తాహెర్, దేశం సంతోష్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, పాల్గొన్నారు.

విద్యార్థులకు రూ.46 కోట్ల స్కాలర్‌షిప్‌లు


స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థినులతో డీజీఎం

కడ్తాల్, ఆగస్టు 14: కెనరా బ్యాంకు 2013లో అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విద్యాజ్యోతి కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 95,245 మంది ఎస్సీ, ఎస్టీ బాలికలకు రూ.46 కోట్ల స్కాలర్‌షిప్‌లు అందించినట్లు బ్యాంకు డీజీఎం సునిల్‌కుమార్ తెలిపారు. ఈఏడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 44,742 మంది విద్యార్థినులకు రూ.18 కోట్లు అందజేయనున్నట్లు చెప్పారు. కడ్తాల్ కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్‌లో స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సునిల్‌కుమార్, ఆర్‌ఎం రాజేశ్వరి, సైబర్ సెక్యూరిటీ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ అంజయ్యలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కెనరా బ్యాంకు పరిధిలోని 11 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 66 మంది ప్రతిభా వంతులైన విద్యార్థినులకు రూ.2,64 లక్షలల స్కాలర్‌షిప్‌లను అందజేశారు. కడ్తాల బ్యాంకు చీఫ్ మేనేజర్ విజయ్‌కుమార్, పలు బ్రాంచ్‌ల మేనేజర్లు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయినాథ్ రెడ్డి జన్మదిన వేడుకలు


కేక్‌కట్ చేస్తున్న కసిరెడ్డి సాయినాథ్ రెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 14: బీఆర్‌ఎస్ జిల్లా యువజన విభాగం నాయకుడు కసిరెడ్డి సాయినాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం మైసిగండిలో అట్టహాసంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ యూత్‌వింగ్, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి కేక్‌కట్ చేసి ప్రజలు పంచిపెట్టారు. పలు చోట్ల మొక్కలు నాటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సాయినాథ్‌రెడ్డిని నాయకులు సత్కరించారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, పలువురు నేతలు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు సయ్యద్ ఖలీల్, గోరటి శ్రీను, సురమల్ల సుభాష్, చంద్రశేఖర్ రెడ్డి, చలిచీమల సతీష్, గుమ్మకొండ రాజు, అబ్దుల్ కలీం, శివ, రూపం వెంకట్ రెడ్డి, చొక్కన్నపల్లి శ్రీనివాస్ రెడ్డి, సామ ప్రభాకర్ రెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ కొట్టేసి.. 70వేలు కాజేసి

- బాధితుడి బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు తీసుకున్న ఆగంతుకుడు

ఆదిభట్ల, ఆగస్టు 14 : బస్సులో ప్రయాణికుడి సెల్‌ఫోన్ కొట్టేసిన ఆగంతుకుడు అతని బ్యాంకు ఖాతా నుంచి రూ.70,500 కాజేసిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తుర్క యాంజాల్ పరిధి శ్రీరామ్‌నగర్‌కు చెందిన కొత్తకుర్మ కృష్ణ నగరంలోని పాతబస్తీలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం ఉదయం 10 గంటలకు ఇబ్రహీంపట్నం నుంచి అఫ్జల్‌గంజ్‌కు వెళ్తున్న బస్సులో తుర్కయాంజాల్ బస్‌స్టాప్ నుంచి బయలుదేరాడు. కొన్ని నిమిషాల వ్యవధిలోనే బస్‌పాస్ కోసం జేబులో చూసేసరికి సెల్ కనిపించలేదు. ముందు స్టాప్‌లో దిగి తన సెల్‌ఫోన్‌కు ఫోన్ చేయగా రెండు రింగ్‌ల అనంతరం స్విచ్ఛాఫ్ అయ్యింది. డ్యూటీకి వెళ్లిన తరువాత తన ఫోన్ చోరీకి గురైనట్లు గుర్తించి యూపీఐడీని బ్లాక్ చేయించేందుకు బ్యాంకుకు వెళ్లగా తన అకౌంట్లో నుంచి రూ.70,500 డెబిట్ అయినట్లు గుర్తించాడు. మొబైల్ ఫోన్ దొంగిలించి బ్యాంకు ఖాతాలో ఉన్న మొత్తాన్ని దొంగిలించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బుధవారం కృష్ణ ఆదిభట్ల పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కేశంపేట, ఆగస్టు 14: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల పరిధిలోని వేమల్‌నర్వ గ్రామ యువత ప్రజలకు సూచించారు. యువకులు దాదాపు రూ.25వేలతో గ్రామంలో బుధవారం కలుపు నివారణ చర్యలు చేపట్టారు. వీధుల వెంట పెరిగిన కలుపు మొక్కలపై నివారణ మందును పిచికారీ చేశారు. త్వరలో బోనాలు నిర్వహిస్తుండటంతో మందు పిచికారీ చేశామన్నారు. మనోహర్‌గౌడ్, ఆనంద్‌రెడ్డి, కృష్ణ, శ్రీశైలం, గిరి, నర్సింహ, శ్రీను, శ్రీకాంత్, రాఘవేందర్, కారోబార్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడిన వారికే పార్టీలో పదవులు


శంకర్‌రావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్/షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 14 : పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడ్డ వారికి మాత్రమే పదవులు దక్కుతాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మరో ఏడాదిలోపే స్థానిక సంస్థల, మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయని, ఇప్పటి నుంచి కార్యకర్తలు ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తే ప్రజల ఆదరాభిమానాలను పొందగలుగుతామని చెప్పారు. నియోజకవర్గంతో పాటు, పట్టణంలో పార్టీ అభివృద్ధి కోసం పాటుపడే నాయకులకు నామినేటెడ్ పోస్టులతో పాటు, వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్‌గా పోటీచేసే అవకాశం లభిస్తుందన్నారు. షాద్‌నగర్ పట్టణానికి సంబంధించి ఒక కమిటీ ఏర్పాటు చేసుకుని సభ్యులు ప్రతీ వార్డును సందర్శించి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషిచేయాలన్నారు. సీనియర్ నేతలు బాబర్‌ఖాన్, చెన్నయ్య, విశ్వం, తిరుపతిరెడ్డి, రఘునాయక్, బస్వం అప్ప తదిరులున్నారు. కాగా, మాజీ మంత్రి డాక్టర్ పి.శంకర్‌రావును ఎమ్మెల్యే శంకర్ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసిశారు. ఆయన్ను.. సతీమణి శంతమ్మలను సన్మానించారు. నాయకులు బాబర్‌ఖాన్, చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, సీతారాం, శేఖర్, దర్శన్ తదితరులు ఉన్నారు.

ప్రజలందరికీ హనుమంతుడి అనుగ్రహం ఉండాలి


పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

షాద్‌నగర్, ఆగస్టు 14 : ప్రజలందరిపై ఆంజనేయ స్వామి అనుగ్రహం ఉండాలని ఆ దేవుడిని ప్రార్థించినట్లు ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ రెడ్డి చెప్పారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండలం దోంతికుంట తండాలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం నవీన్‌రెడ్డి మాట్లాడుతూ ఆంజనేయ స్వామిని గిరిజనులు భక్తి శ్రద్ధలతో పూజించడంతో పాటు, మందిరాన్ని కూడా నిర్మించడం హర్షణీయమన్నారు. షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కూడా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ నేతలు ఈట గణేష్, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులకు పోస్టల్ బీమా కార్డులు పంపిణీ


బీమా కార్డులను చూపిస్తున్న గ్రామస్తులు

చేవెళ్ల, ఆగస్టు 14 : చేవెళ్ల మాజీ జెడ్పీటీసీ తనయుడు పర్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ పెద్దోళ్ల దయాకర్ బుధవారం మండల పరిధి రామన్నగూడ గ్రామస్తులకు పోస్ట్ ఆఫీస్ వారి సహకారంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామంలో ఉన్న ప్రతీ ఇంటికి ఉచిత బీమా రూ. 10లక్షలు కవరేజ్ వర్తించేలా కార్డులను పంపిణీ చేశారు. బీమాకు సంబంధించిన రూ.1,63,125 ప్రీమియం పోస్టు ఆఫీస్‌కు ట్రస్ట్ తరఫున చెల్లించనున్నట్లు చెప్పారు. గ్రామస్తులు దయాకర్‌ను అభినందించారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్, మాజీ సర్పంచ్‌లు, గ్రామస్తులు, మహిళలు తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

కందుకూరు : కొత్తూరు రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 156, 157లోని నక్షబాటపై గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు విభిన్న అభిప్రాయాలు వ్యక్తం చేశారు. బీజేపీ నాయకులు రియల్‌ఎస్టేట్ వ్యాపారికి అనుకూలంగా తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇవ్వగా.. కాంగ్రెస్ నాయకులు సత్తార్ రవికుమార్‌రెడ్డి అదే బాటను పునరుద్ధరించాలని కోరుతూ వినతి పత్రం ఇచ్చారు. కాగా, రెండు పార్టీల నాయకులు నక్షబాటపై విభిన్న అభిప్రాయంతో వినతిపత్రం ఇవ్వడం ఏమిటని అధికారులు పేర్కొంటున్నారు.

మాడ్గుల : ఫిరోజ్‌నగర్ మాజీ ఉపసర్పంచ్ యాతం అంజమ్మ గతేడాది మృతిచెందింది. ఆమె విగ్రహాన్ని భర్త జంగయ్య యాదవ్, కుమారుడు, కూతుళ్లతో కలసి ఆవిష్కరించారు.

తలకొండపల్లి : సుక్కాపూర్, చెన్నారం, పాతకోట తండా, పడమటి తండా పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రైతులు, నాయకులు ఏఈ కటారియాను కలిసి వినతిపత్రం అందచేశారు. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రమేష్ నాయక్, మాజీ ఎంపీటీసీ యాదయ్య, రైతులున్నారు.

శంకర్‌పల్లి : మున్సిపాలిటీ పరిధిలోని బుల్కాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయ్ లా కళాశాల, హైదరాబాదు లీగల్ ఎయిడ్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'మీ హక్కులను తెలుసుకోండి' అంశంపై అవగాహన కల్పించారు. ఇక్ఫాయి లా కళాశాల డీన్ డాక్టర్ వై. ప్రతాప్‌రెడ్డితో పాటు హైదరాబాద్ లీగల్ ఎయిడ్ సొసైటీ సభ్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, కవిత్వం, కథా విన్యాసం, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించారు.

మొయినాబాద్ రూరల్ : కాంగ్రెస్ నాయకుడు అవిశిపేట ఆంజనేయులు గౌడ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖలో నిర్వహిస్తున్న బదిలీల్లో భాగంగా చిన్నమంగళారం కార్యదర్శిగా శివకుమార్ బాధ్యతలు స్వీకరించడంతో గ్రామస్థులతో కలిసి సన్మానించారు. మాజీ సర్పంచ్ రాములు, వాసుదేవులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : బీజేపీ మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా ఉడుత హరికృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో హరికృష్ణకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య నియామక పత్రం అందించారు.

కందుకూరు : కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న తపాల సేవలను ప్రతీ ఒక్కరు వినియోగించుకునేలా సిబ్బంది పనిచేయాలని పోస్టు మాస్టర్ జనరల్ టీఎం శ్రీలత కోరారు. తిమ్మాపురంలో పోస్టాఫీస్ ద్వారా ప్రజలకు చేస్తున్న సేవలపై నిర్వహించిన అవగాహన కల్పించారు.

నందిగామ : మండల కేంద్రానికి చెందిన నంది గామ సింగిల్‌విండో మాజీ చైర్మన్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు జిల్లెల్ల రాంరెడ్డి కొన్ని రోజులుగా అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొంది ఇటీవలే నందిగామలోని తన ఇంటికి వచ్చాడు. షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు.

ఆమనగల్లు : మున్సిపాలిటీ పరిధిలో కుక్కల బెడదను నివారించాలని స్థానిక నాయకులు మున్సిపాలిటీ పాలకవర్గం, అధికారులను కోరారు. ఈమేరకు కమిషనర్ వసంతను కలిసి వినతి పత్రం అందజేశారు.

ఆమనగల్లు : ఆమనగల్లు లయన్స్‌క్లబ్ సమావేశం భవాని గార్డెన్‌లో నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్లు చెన్నకిషన్ రెడ్డి, నరేందర్ రెడ్డి, రాంరెడ్డి లయన్స్‌కంటి ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ దామోదర్ రెడ్డిలు హాజరయ్యారు. 2024-25లో చేపట్టే సేవా కార్యక్రమాల ప్రణాళికను రూపొందించారు.

షాద్‌నగర్ అర్బన్ : ఆర్టీసీ బస్సులో ఎక్కిన విద్యార్థినులను పరుష పదజాలంతో దూషిస్తున్న కండక్టర్‌పై చర్య తీసుకోవాలని కేశంపేట మండలం, సంగెం గ్రామస్థులు విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. షాద్‌నగర్ ఆర్టీసీ బస్ డిపో గేటు ఎదుట ధర్నా చేసి, సమస్యను డిపో మేనేజర్ ఉషకు ఫిర్యాదు చేశారు. కండక్టర్ రాములు దూషిస్తున్నాడని, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడంతో.. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని డీఎం చెప్పారు.

ఆమనగల్లు : అమెరికా, దక్షిణ కొరియా పర్యటనను ముగించుకొని హైదరాబాద్‌కు చేరుకున్న సీఎం రేవంత్‌కు శంషాబాద్ విమానాశ్రయంలో ఎంపీ మల్లు రవి ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు చెప్పారు.

కడ్తాల్ : ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండి తమ తల్లిదండ్రులకు, బంధువులకు, స్నేహితులకు వివరించాలని ఎస్సై వరప్రసాద్ అన్నారు. కడ్తాల్ కేజీబీవీలో స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

కడ్తాల్ : ప్రజా సేవ చేసేందుకు యువత రాజకీయాల్లోకి రావాలని యూట్యూబర్ బర్రెలక్క (శిరీష) పిలుపునిచ్చారు. సమాజ సేవ, ప్రజా చైతన్య కార్యక్రమాల్లో యువత ముందుండాలని కోరారు. కడ్తాల మండలంలో పర్యటించారు. బర్రెలక్కను గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు పోతుగంటి అశోక్ ఆధ్వర్యంలో నాయకులు సత్కరించి అభినందించారు. ప్రజా సమస్యలపై పోరాడే వారిని ప్రజలు ఆదరించి పాలకులుగా గెలిపిస్తారని తెలిపారు. జహంగీర్ అలీ, సురేశ్, శివ, మణి, గణేశ్, కార్తీక్, మణికంఠ, రాఖీ తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

నాయనమ్మను చంపిన కేసులో మనవడికి పదేళ్ల జైలు

- పింఛన్ డబ్బులు ఇవ్వనందుకు అఘాయిత్యం

కేశంపేట, ఆగస్టు 14: మద్యానికి డబ్బులు ఇవ్వలేదని నాయనమ్మను హత్య చేసిన ఘటనలో మనవడికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ రంగారెడ్డి జిల్లా 9వ అదనపు న్యాయాధికారి హరీష బుధవారం తీర్పు వెల్లడించారు. కేశంపేట ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కాకునూర్ గ్రామానికి చెందిన కుమ్మరి శేఖర్ జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో 2019 డిసెంబరు 12న రాత్రి 10 గంటల సమయంలో నాయనమ్మ కుమ్మరి లక్ష్మమ్మను మద్యం సేవించేందుకు పింఛన్ డబ్బులు ఇవ్వమని అడిగాడు. ఆమె నిరాకరించడంతో.. తలను నేలకు బాదాడు. కర్రతో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడి మృతిచెందింది. హత్యపై కుమ్మరి యాదగిరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన అప్పటి సీఐ రామకృష్ణ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అనంతరం పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఘు కేసుకు సంబంధించి దోషులను సాక్ష్యాధారాలతో కోర్టులో నిరూపించడంతో న్యాయాధికారి శేఖర్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది.

గిరిజన బాలికపై లైంగికదాడి కేసులో ముగ్గురు రిమాండ్

- పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు.. పరారీలో అబార్షన్ చేసిన డాక్టర్

శంషాబాద్ రూరల్/కొత్తూర్, ఆగస్టు 14 : గిరిజన బాలికపై లైంగిక దాడి కేసులో నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సో కేసులు నమోదు చేసినట్లు బుధవారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్‌రావు చెప్పారు. శంషాబాద్ మండలం జూకల్ అనుబంధ గ్రామం ఎర్రగుంట తండాకు చెందిన 13ఏళ్ల బాలికను జూకల్‌కు చెందిన మన్నె కృష్ణారెడ్డి లైంగిక దాడి చేయడంతో గర్భం దాల్చింది(5నెలల). విషయం తెలియడంతో కృష్ణారెడ్డి తండ్రి గోపాల్‌రెడ్డి, సోదరుడు మహిపాల్‌రెడ్డితో కలిసి బాలికను కొత్తూరులోని శ్రీనివాసా క్లినిక్‌లో డాక్టర్ రంజిత్ వద్ద అబార్షన్ చేయించారు. బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో విషయం బయటకు పొక్కింది. ఆమె తల్లి మంగళవారం ఫిర్యాదు చేయడంతో నిందితులపై కేసులు నమోదు చేశారు. అబార్షన్‌కు సహకరించిన తండ్రి, సోదరుడు, డాక్టర్ రంజిత్‌పై కేసులు నమోదు చేశామని, కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ చెప్పారు. త్వరితగతిన విచారణ పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేస్తామని చెప్పారు. బాలిక గర్భవతి కావడానికి కారణమైన కృష్ణారెడ్డిని ఏ1 నిందితుడిగా, తండ్రి ఏ2గా, ఏ3గా మహిపాల్‌రెడ్డిని చేర్చామని, కోర్టులో హాజరపర్చి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. కాగా, అబార్షన్ చేసిన డాక్టర్ రంజిత్ తన క్లినిక్‌కు తాళంవేసి పరారీ అయ్యాడని, గాలింపు చర్యలు చేపట్టామని ఏసీపీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

యాచారం, ఆగస్టు 14 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధి గున్‌గల్ చౌరస్తా వద్ద బుధవారం చోటుచేసుకుంది. శ్రీను అనే వ్యక్తి బైక్‌పై ఇబ్రహీంపట్నం వైపు వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోవడంతో కిందపడ్డాడు. దాంతో అతడికి తీవ్రంగా గాయాలయ్యాయి. పెట్రోమొబైల్-1 పోలీసులు ఇబ్రహీంపట్నం ఆస్పత్రికి తరలించారు.